క్లుప్తంగా

శ్రీపీఠంలో మహాన్నదానం



శ్రీపీఠంలో భక్తులకు అన్న ప్రసాదం వడ్డన చేస్తున్న పరిపూర్ణానంద స్వామీజీ

కాకినాడ రూరల్: మహా శివరాత్రి పర్వందినాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట శ్రీపీఠంలో గురువారం మహాన్నదానం నిర్వహించారు. ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించి, అనంతరం అన్న ప్రసాదాన్ని భక్తులకు పరిపూర్ణనంద స్వామి చేతులు మీదుగా వడ్డించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

స్వచ్ఛంద సేవకులకు సన్మానం



స్వచ్ఛంద సేవకులను సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవకులు పిల్లి నాగేశ్వరరావు, ఎం.శ్రీధర్‌లను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజ సేవ చేయడానికి పలు స్వచ్ఛంద సేవా సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. కాకినాడ రూరల్‌లో మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వ్యవస్థాపకుడు పిల్లి నాగేశ్వరరావు, అభినయ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.శ్రీధర్ పేదల కోసం ప్రతినెలా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో నీటి కుంటలు నిర్మించాలి



ఉపాధి పనులపై సమీక్షిస్తున్న ఏపీఓ రమణకుమార్

కరప: గ్రామాల్లో రైతులకు ఉపయోగపడేలా నీటి కుంటలు నిర్మించేలా తగిన స్థలాన్ని గుర్తించాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ జీవీ రమణ కుమార్ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, సిబ్బందితో ఆయన సమావేశమై ఉపాధిపనులపై సమీక్షించారు. గ్రామాల్లో రైతులను కలసి వారికి అనువైన ప్రాంతాన్ని గుర్తించి పంటపొలాల్లో నీటినిల్వల కోసం నీటి కుంటలు నిర్మించాలన్నారు. ఉపాధి పథకం పనుల్లో వేగం పెంచి, ఎక్కువ మందికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ రమణకుమార్ కోరారు. టెక్నికల్ అసిస్టెంట్లు కేజే ప్రకాష్, టి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్‌ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004



వాకలపూడి హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో వేచి ఉన్న పట్టభద్రులు



రమణయ్యపేట ఏపీఎస్పీ పోలింగ్ కేంద్రం వద్ద పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు



ఇంద్రపాలెం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మల్లిబాబు, తహసీల్దార్ కుమారి తదితరులు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

కాకినాడ రూరల్‌లో 62.9శాతం పోలింగ్



కరపలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ మల్లిబాబు

కాకినాడ రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి కాకినాడ రూరల్ మండలంలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 62.9 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 10,499 మంది ఓటర్లకు 6604 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 5904 మందికి 3754 మంది, స్త్రీలు 4595 మందికి 2850మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుంచి పోలింగ్ సరళి చూస్తే ఉదయం పది గంటలకు 14.31 శాతం, మధ్యాహ్నం 12గంటలకు 26.22 శాతం, రెండు గంటలకు 42.22 శాతం, పోలింగ్ ముగిసే సరికి 62.90 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 4 గంటలకు వాకలపూడి, తూరంగి, రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఓటర్లు క్యూలైన్లలో ఉండిపోవడంతో వారికి స్లిప్‌లు అందజేసి, ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో కొన్ని చోట్ల సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరిగింది. రమణయ్యపేటలో 5, ఇంద్రపాలెంలో 4, వాకలపూడి, తూరంగిలో రెండేసి చొప్పున 13 కేంద్రాలు ఏర్పాటు చేశారు. రమణయ్యపేటలోని 128వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 55.33 శాతం పోలింగ్, ఇంద్రపాలెంలో 135వ కేంద్రంలో అత్యధికంగా 67.97 శాతం ఓటింగ్ జరిగింది. ఇంద్రపాలెంలో పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ మల్లిబాబు, తహసీల్దార్ కుమారి తదితరులు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు సమీపంలో కూటమి నాయకులు స్లిప్‌లు పంపిణీ చేస్తూ హడావుడి చేశారు. పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు ఏపీఎస్పీ వద్ద పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ తీరును తెలుసుకున్నారు.

కరపలో 71.63 శాతం..

కరప: మండల పరిధిలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలో 2,451 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా 1,760 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మూడు పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేయగా 71.63 శాతం పోలింగ్ నమోదు అయింది. 141వ బూత్‌లో 838 ఓటర్లు ఉండగా 367 మంది పురుషులు, 216 మంది స్త్రీలు, 142వ బూత్‌లో 868 మందికి 388 మంది పురుషులు, 230 మంది స్త్రీలు, 143వ బూత్‌లో 751 మంది ఓటర్లకు 385 మంది పురుషులు, 174 మంది స్త్రీలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు 20 శాతం పోలింగ్ నమోదు కాగా తర్వాత వేగం పుంజుకుంది. ఆర్డీఓ మల్లిబాబు స్థానిక పోలింగ్‌స్టేషన్లలో ఏర్పాట్లను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఆర్ఐ పవన్, వీఆర్వోలు పీఎంవీ ప్రసాద్‌శర్మ తదితరులు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఎస్ఐ టి.సునీత పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఓటు వేసిన ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: తూర్పు–పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో కాకినాడ ఆర్డీఓ ఎస్ మల్లిబాబు కాకినాడ ఆర్‌అండ్‌బి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రెండు నుంచి నూకాలమ్మ జాతర

బోట్‌క్లబ్: స్థానిక పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు మార్చి 2 నుంచి ఏప్రియల్ 15 జరుగుతాయని ఆలయ ఈఓ ఎం.వీరభద్రరావు గురువారం విలేకర్లకు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

అనోస్మియాతో వాసన చూసే శక్తి కోల్పోతాం



ప్రముఖ ఈఎన్‌టీ వ్యాధి నిపుణుడు లక్ష్మణ్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: అనోస్మియా వ్యాధి వస్తే వాసన చూసే శక్తి కోల్పోతామని ప్రముఖ ఈఎన్‌టీ వ్యాధి నిపుణులు లక్ష్మణ్ ప్రసాద్ అన్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అనోస్మియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైరల్ ఇన్ఫెక్షన్‌లు, తలకు గాయాలు, ముక్కులో పాలిప్స్, కొన్ని మందులు, నాడీ సంబంధ రుగ్మతల వల్ల ఇది సంభవిస్తుందన్నారు. దీని వల్ల గ్యాస్ లీకేజీలు, పొగవంటి వాసనలు గుర్తించే సామర్థ్యం దెబ్బ తింటుందన్నారు. దీనికి తక్షణ వైద్య సహాయం తీసుకోవడం చాలా అవసరమన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ ప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదరణ కోల్పోతున్న దర్జీలు

- ఆర్థిక భరోసా కల్పించని కూటమి ప్రభుత్వం
- జగనన్న చేసిన మేలు మరువలేమంటున్న టైలర్లు
- నేడు ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా..



కరపలోని దుస్తులు కుడుతున్న టైలర్

కరప: వస్త్ర ప్రపంచంలో సాంకేతిక మార్పులు, బట్ట ఖరీదుతో పాటు కుట్టుకూలీ కంటే తక్కువ ధరలోనే నాణ్యమైన, మన్నికైన, అభిరుచికి తగ్గ స్టైల్‌లో కాలానుగుణమైన ఫ్యాషన్‌తో దుస్తులు అందుబాటులోకి రావడంతో సాంప్రదాయ దర్జీలు క్రమంగా కనుమరుగవుతున్నారు. కాలంతో ఎదురీదలేని పరిస్థితుల్లో వారి వృత్తి ఆదరణ క్రమంగా ఆదరణ కోల్పోతోంది. ఇటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేదోడు పథకం కింద ఏటా రూ.10 వేలు ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ మాటే లేకపోవడంతో దర్జీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యేటా ఫిబ్రవరి 28న ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కాకినాడ రూరల్ నియోజక వర్గంలో 800 మంది టైలర్లు ఉంటే కరప మండలంలోని సుమారు 350 నుంచి 450 మంది వరకు ఉన్నారు. వారిలో 150 మంది మహిళలు ఉండడం గమనార్హం. ఒకప్పుడు కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి జీవించేవారు. చేతినిండా పని కరవవ్వడంతో షాపింగ్‌మాల్స్‌లో పనిచేసేందుకు టైలరింగ్ వృత్తిపని వారు పట్టణాలకు వలసపోతున్నారు. వృత్తి సహాయకులైతే వస్త్ర దుకాణాల్లో పనిచేసేందుకు, సైకిళ్లపై వస్త్రాలను అమ్మకాలు సాగిస్తూ జీవిస్తున్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

భవన నిర్మాణ కార్మికులకు, కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చిన విధంగానే టైలర్లకు కూడా గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని దర్జీలు కోరుకుంటున్నారు. తదేక దృష్టితో పని చేయడం వల్ల కంటి, నడుం నొప్పి వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నట్టు టైలర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి 50 ఏళ్లు నిండిన టైలర్లకు కూడా పింఛన్లు మంజూరుచేయాలని దర్జీలు కోరుకుంటున్నారు.

టైలర్లకు ఆర్థిక సాయం అందించాలి



టైలరింగ్ వృత్తి పట్ల డిమాండ్ తగ్గినా వేరే పని చేయలేక ఇందులోనే కొనసాగుతున్నాం. ఎంత కష్టపడి పనిచేస్తున్నా పోటీ ప్రపంచంలో శ్రమకుదగ్గ ఫలితం ఉండటంలేదు. విద్యుత్ చార్జీలలో రాయితీలు కల్పించి, ఆర్థికసాయం అందించి ప్రభుత్వమే ఆదుకోవాలి. ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలి.

కొసనా రాజగోపాల్, సూపర్ టైలర్, కరప

పింఛన్లు ఇవ్వాలి



20 ఏళ్లుగా ఇదే వృత్తిలో ఉండటంవల్ల, వేరే పనిచేయలేకపోతున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించేవారు. జగనన్న మేలు మరువలేము. ఈ ప్రభుత్వం వచ్చాక తమను పట్టించుకోవడంలేదు. 50 ఏళ్లు నిండిన టైలర్లకు పింఛన్ మంజూరు చేయాలి. దర్జీలకు బ్యాంకుల ద్వారా రాయితీపై రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

కె.భాస్కరరావు, టైలర్, కరప

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో త్ర్యంబకేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

కాకినాడ రూరల్: మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు శివాలయాలలో లింగోద్భవ కాలంలో అర్చకులు ఏకాదశ రుద్రాభిషేకాలను ఘనంగా నిర్వహించారు. రోజంతా శివనామ స్మరణతో స్మరించిన భక్తులు అర్ధరాత్రి వరకు శివాలయాల వద్ద జాగరణ చేస్తూ అభిషేకాలను తిలకించారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ వద్ద పార్వతీ సమేత త్ర్యంబకేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు 11సార్లు అభిషేకాలు నిర్వహించారు. లింగోద్భవ కాల ఘడియల్లో లింగాకారంలో మహాదేవుడు అవతరించినట్టు భావించి శివ పంచాక్షరి జపించారు. ఆలయ ప్రాంగణంలో అర్ధరాత్రి పన్నెండు గంటలకు ప్రమిదల్లో దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీకి చెందిన ఆకుల రాజబాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ దంపతులు హాజరయ్యారు. నేమాంతో పాటు అన్ని శివాలయాలలో లింగోద్భవ అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కాకినాడ క్రైం/సామర్లకోట: తమ ప్రేమ వివాహాన్ని పెద్దలు కాదనడంతో తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లికి చెందిన యువతి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుచురాపల్లికి చెందిన ఆర్.మీనాక్షి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. అతడు పిఠాపురంలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తమ వివాహానికి ఆమె పెద్దలు అనుమతి నిరాకరించారు. ఆ విషయాన్ని తన భర్తకు చెప్పేందుకు ఆమె తిరుచురాపల్లి నుంచి వస్తోంది. ఈ క్రమంలో రైలు సామర్లకోట వద్దకు వచ్చాక అతనికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో అతడు వాళ్లు ఒప్పుకోనపుడు తన వద్దకు మాత్రం ఎందుకు అవసరం లేదు వెళ్లిపో అని బదులిచ్చాడు. దీంతో మనస్తాపానికి గురైన మీనాక్షి డోలో 650 ట్యాబ్లెట్లు 20 మింగేసింది. అపస్మారక స్థితికి వెళ్లిన ఆమెను తోటి ప్రయాణికులు జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు. అక్కడ పోలీసులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ సిటీ: స్థానిక డెయిరీ ఫాం సబ్‌స్టేషన్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ ఉపకేంద్రం రెవెన్యూ కాలనీ ఫీడర్ లైన్ విద్యుత్ మరమ్మతుల వల్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. రాజీవ్ గృహకల్ప రెవెన్యూ కాలనీ ఏరియా దుమ్ములపేట, మున్సిపల్ స్కూల్ ఏరియా కొంతవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఈఈ తెలిపారు.

కోలాహలంగా భీమేశ్వరుని రథోత్సవం

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- భారీ ఎత్తున పోలీసు బందోబస్తు



సామర్లకోట చంద్రశేఖరస్వామి రథోత్సవాన్ని ప్రారంభించిన ఆవాల లక్ష్మీనారాయణ, రాజేశ్వరి తదితరులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామభీమేశ్వర స్వామి రథోత్సవం పట్టణంలో కోలాహలంగా జరిగింది. గురువారం సాయంత్రం ఈ రథోత్సవాన్ని ప్రారంభించారు. రథాన్ని వారం రోజుల ముందే గాంధీచౌక్‌కు తరలించారు. అక్కడ రథానికి, పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. గోదావరి కాలువ ఆవలివైపు ఉన్న పంచారామ క్షేత్రం నుంచి స్వామి వారి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను పల్లకిపై బాణ సంచా కాల్పుల నడుమ రైల్వే గేటు మీదుగా గాంధీచౌక్ సెంటర్‌కు తీసుకువచ్చారు. ఉత్సవ విగ్రహాలకు ఆలయ పండితులు అల్లకి రాజగోపాల్‌శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ ప్రత్యేక పూజలు చేశారు. రథానికి ఎదురుగా ఏర్పాటు చేసిన కుంభం మీదుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, భక్త సంఘం అధ్యక్షుడు బిక్కిన సాయి రథాన్ని కదిలించారు. గాంధీచౌక్ నుంచి పెద్దవీధి, బళ్లమార్కెట్ సెంటర్, గొల్లగూడెం, నీలమ్మచెరువు, దేవీచౌక్ మీదుగా తిరిగి గాంధీచౌక్‌కు రథోత్సవం చేరింది. స్వామి, అమ్మవార్లను తిలకించడానికి దారి పొడవునా భక్తులు బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త పసల పద్మరాఘవరావు, భక్త సంఘం నాయకులు ఆర్వీ సుబ్బరాజు, గంజి బూరయ్య, రథోత్సవ కమిటీ నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కోలసంబరం, వీరభద్రుని సంబరం, గారడీ, మ్యూజికల్ బ్యాండ్, పులి వేషాలు, కాళికాదేవి వేషం, తాంబూళ మేళం, నాగ ఆఘోరి నృత్యం, తీన్ మార్, కేరళ రెక్కల డ్యాన్సు, డాల్స్, పొడుగు కాళ్ల ప్రదర్శన, హనుమంతుని వేషం, చైనా కొబ్రా, లక్క గుర్రాలు, దాండియా నృత్య సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ప్రజా ప్రతినిధులు, రైతులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు, భక్త సంఘ నాయకులు, రైతు సంఘ నాయకులు, భక్తులకు సేవలందించారు. డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ ఎ.కృష్ణ భగవాన్ పర్యవేక్షణలో 10 మంది ఎస్సైలు, 35 మంది పోలీసు కానిస్టేబుళ్లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాయీ బ్రాహ్మణ కళాకారులకు సత్కారం

రథోత్సవంలో భాగంగా మ్యూజికల్ బ్యాండ్‌లో పాల్గొన్న కళాకారులను నాయి బ్రాహ్మణ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ స్వయంభూరపు వీరభద్రరావు సత్కరించారు.

భక్తి శ్రద్ధలతో చంద్రశేఖరస్వామి రథోత్సవం

స్థానిక పాత సామర్లకోటలోని బాలా త్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో గురువారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 24వ తేదీన స్వామి వారి కల్యాణం జరగడంతో మహాశివరాత్రి మరుసటి రోజు రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ పండితులు డి.పాపయ్యశాస్త్రి, చీమలకొండ వెంకటరమణల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి ఆధ్వర్యంలో రథోత్సవాన్ని వైఎస్సార్ సీపీ అయ్యారక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, అయ్యారక కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ ఆవాల రాజేశ్వరి దంపతులు ప్రారంభించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: శివరాత్రిని పురస్కరించుకుని మండలంలో ఉన్న పలు శివాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న బాలాత్రిపుర సమేత రాజశేఖర స్వామి, ఉప్పాడలో మత్స్యలింగేశ్వరస్వామి, చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, ఎండపల్లిలో మాణిక్యాంబ సమేత రాలింగేశ్వర స్వామి, గోర్స ఉమా రామలింగేశ్వర స్వామితో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర రాజశేఖరస్వామి ఆలయంలో భక్తి పాటల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తీర్థం, రథోత్సవం, కోలాటం నిర్వహించనున్నట్లు తెలిపారు.



సామర్లకోటలోని భీమేశ్వరస్వామి రథోత్సవం



సామర్లకోటలో ఆకట్టుకున్న కాళికా మాతలు



లక్క గుర్రాల డాన్సు



ఆకట్టుకున్న నాగా అఘోరీల నృత్యాలు



పంచారామ క్షేత్ర రథోత్సవంలో కేరళ రెక్కల నృత్యం



నాయీ బ్రాహ్మణ కళాకారులను సత్కరించిన కౌన్సిలర్ వీరభద్రరావు